క్లుప్తంగా

ఉమాచంద్రమౌళీశ్వరుడికి విశేష పూజలు



సింహాచలం: అడవివరంలోని విజినిగిరిపాలెంలో ఉన్న ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామికి విశేషంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు, మహిళలు ఆలయానికి తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. బిల్వపత్రాలతో స్వామికి అర్చన చేశారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఈ పూజలను నిర్వహించారు.

కవలలకు తులాభారం

- 15 కిలోల పటిక బెల్లం సమర్పణ



కవల పిల్లలకు తులాభారం వేస్తున్న తల్లిదండ్రులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం భీమడోలు ప్రాంతానికి చెందిన కవల పిల్లలకు తులాభారం క్రింద పటికబెల్లంను తల్లిదండ్రులు సమర్పించారు. ఉదయం సింహగిరికి కవలలను తీసుకొచ్చిన తల్లిదండ్రులు ఆలయ ప్రాంగణంలో ఉన్న త్రాసులో ఆ పిల్లలను ఉంచి తులాభారం వేశారు. వారి బరువు 15 కిలోలు ఉండటంతో దానికి సరిపడా పటిక బెల్లం సమర్పించారు. కవలలను తులాభారం వేసేటప్పుడు పలువురు భక్తులు ఆసక్తిగా తిలకించారు.

అప్పన్న సన్నిధిలో ఎమ్మెల్యే రాజు



కప్ప స్తంభానికి మొక్కుకుంటున్న ఎమ్మెల్యే రాజు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని సోమవారం చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు స్వామికి అష్టోత్తర పూజ నిర్వహించారు. వేద ఆశీర్వచనం అనంతరం ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాన్ని సూపరింటెండెంట్ త్రిమూర్తులు అందించారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ సౌజన్యంతో ముత్యాలమ్మపాలెం గ్రామంలో సోమవారం శంకర్ ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సింహాద్రి ఎన్టీపీసీ యాజమాన్యం సీఎస్సార్ విభాగం ద్వారా అందిస్తున్న సేవలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. వైద్య శిబిరంలో పాల్గొన్న 255 మంది రోగులకు శంకర్ ఫౌండేషన్ వైద్య సిబ్బంది కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, అవసరమైన వారికి కళ్లద్దాలను ఎమ్మెల్యే పంచకర్ల, ఎన్టీపీసీ జీజీఎం సమీర్‌శర్మలు అదించారు. కార్యక్రమంలో ఎన్టీపీసీ సీఎస్సార్ విభాగం అధికారులు, స్థానిక సర్పంచ్ సీహెచ్ సుజాతముత్యాలు, ఎంపీటీసీ అరిజిల్లి దేవి రవి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సబ్బవరం: మండలంలోని సబ్బవరం సెక్షన్-1 పరిధి 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో న్యూ బ్రేకర్స్ కన్‌స్ట్రక్షన్ వర్క్స్ కారణంగా పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు బుధవారం అంతరాయం ఏర్పడనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎస్.రామకృష్ణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. దీంతో ఆ రోజు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సబ్బవరం, తవ్వవానిపాలెం, అమృతపురం, గొల్లపాలెం, పైడివాడ, అసకపల్లి, ఇరువాడ పంచాయతీల పరిధి గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు. వినియోగదారులు తమ సిబ్బందికి సహకరించాల్సిందిగా కోరారు.

ఓపెన్ జిమ్‌లతో.. ఆరోగ్యం.. ఆహ్లాదం

- ఓపెన్ జిమ్‌లకు పెరుగుతున్న ఆదరణ
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏర్పాటు
- రద్దీగా వేపగుంట, సమతాకాలనీ ఓపెన్ జిమ్‌లు
- అధికంగా తరలివస్తున్న గృహిణులు, వృద్ధులు
- పార్కులుగా అభివృద్ధి చేసుకుంటున్న స్థానికులు

నగరం.. ఉరుకుల పరుగుల జీవితం. అరగంట వ్యాయామం చేద్దామన్నా.. అనుకూల సమయం దొరక్క, ప్రైవేట్ జిమ్‌లకు అంతంత డబ్బులు వెచ్చించలేక ఎంతో మంది వెనుకడుగు వేసే పరిస్థితి. ఈ బిజీ లైఫ్‌లో కాస్త శారీరక ఆరోగ్యం గురించి కూడా పట్టించుకోవాలి కదా. అందుకే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జీవీఎంసీ పరిధిలోని ఖాళీ స్థలాలను పార్కులుగా, ఓపెన్ జిమ్‌లుగా తీర్చిదిద్దారు. అందులో భాగంగా ఏర్పాటు చేసినవే వేపగుంట, సమతా కాలనీలోని ఓపెన్ జిమ్‌లు. వీటికి పిల్లల నుంచి పెద్దల వరకు రోజూ వందల సంఖ్యలో వచ్చి, ఆరోగ్యంతోపాటు, ఆహ్లాదాన్ని పొందుతున్నారు.



సమతా కాలనీ వద్ద ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లో మహిళల వ్యాయామం

సింహాచలం: పాత గోశాల నుంచి వేపగుంట వెళ్లే బీఆర్‌టీఎస్ మార్గంలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లు పరిసర ప్రాంత ప్రజలకు ఆరోగ్యప్రదాయినిలుగా మారాయి. రోడ్డు పక్కన ఉన్న ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.లక్షలు వెచ్చించి వీటిని నెలకొల్పింది. శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసంతోపాటు ఉదయం, సాయంత్రం ఆహ్లాదకర వాతావరణాన్ని ఆస్వాదించేందుకు స్థానికులు వీటిని ఎక్కువగా వినియోగిస్తున్నారు. ఇటీవల కాలంలో వీటికి పెరుగుతున్న ఆదరణే ఇందుకు నిదర్శనం. మరోవైపు స్థానికులే అసోసియేషన్లుగా ఏర్పడి, వీటిని మినీ పార్కులుగా కూడా అభివృద్ధి చేస్తున్నారు..



వేపగుంట సమీపంలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లో వ్యాయామం చేస్తున్న స్థానిక కాలనీల నివాసితులు

మినీపార్కులుగా అభివృద్ధి

వ్యాయామ పరికరాలతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లను ఆయా కాలనీవాసులే సంరక్షించుకుంటున్నారు. ముఖ్యంగా వాటిని మినీ పార్కులుగా అభివృద్ధి చేసుకుంటున్నారు. మొక్కలు, బెంచీలు, ఫెన్సింగ్ తదితర అదనపు ఏర్పాట్లను స్వచ్ఛందంగా చేశారు. నిత్యం వ్యాయామం చేసే వాళ్లకు ఆహ్లాదకర వాతావరణాన్ని సమకూర్చేలా ఓపెన్ జిమ్‌లను తీర్చిదిద్దుతున్నారు. వీటిని చూస్తే చాలు.. ఉదయం, సాయంత్రం కాసేపు కాలక్షేపానికైనా నాలుగు అడుగులు వేద్దామని అనిపించక మానదు. వేపగుంట సమీపంలో ఉన్న ఓపెన్ జిమ్‌కి ఓ విశేషం ఉంది.

ఇక్కడికి వ్యాయామం చేసేందుకు వచ్చేవాళ్లు, సమీప నివాసితులు కలిసి ఓపెన్ జిమ్, వాకర్స్ అసోసియేషన్‌ను ఏర్పాటు చేసుకున్నారు. వ్యాయామం వల్ల కలిగే లాభాలను అందరికీ తెలియజేస్తున్నారు. పైగా ఓపెన్ జిమ్ ప్రాంగణంలో ఏటా స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు.

ఆటవిడుపు.. ఆరోగ్యం

ఒక్కో ఓపెన్ జిమ్‌కు రూ.5 లక్షలు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జీవీఎంసీలోని ఖాళీ స్థలాలను ఓపెన్ జిమ్‌లు, పార్కులుగా జీవీఎంసీ అభివృద్ధి చేసింది. ఇందులో భాగంగానే రెండేళ్ల క్రితం అడవివరంలోని పాత గోశాల నుంచి వేపగుంట వెళ్లే బీఆర్‌టీఎస్ మార్గంలో సమతాకాలనీ వద్ద, వేపగుంటకి సమీపంలో రెండు ఓపెన్ జిమ్‌లను నెలకొల్పారు. ఒక్కో దాంట్లో రూ.5 లక్షలు చొప్పున వెచ్చించి పలు రకాల వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో ఈ ఓపెన్ జిమ్‌లలో నివాసితులు వ్యాయామం, వాకింగ్ చేయడం నిత్యకృత్యంగా మారింది. ప్రహ్లాదపురం, శ్రీనివాసనగర్, అడవివరం, బాలాజీనగర్ నుంచి కూడా పలువురు ఈ ఓపెన్ జిమ్‌లకి వస్తున్నారు. రూ.వందలు, వేలు పోసి జిమ్‌లకు వెళ్లలేని వారికి ఓపెన్ జిమ్‌లు ప్రత్యామ్నాయంగా మారాయి. ముఖ్యంగా ఇళ్లకే పరిమితమైన గృహిణులు ఇంటికి సమీపంలోనే ఓపెన్ జిమ్‌లు ఉండటంతో, కాసేపు ఆటవిడుపుగా వచ్చి వ్యాయామ పరికరాలకు పనిచెప్తున్నారు.



వేపగుంట సమీపంలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లో వ్యాయామం చేస్తున్న నివాసితులు



సమతాకాలనీ ఓపెన్ జిమ్‌లో వ్యాయామం చేస్తున్న ఆయా కాలనీల నివాసితులు

మహిళలకు ఉపయోగం



నేను చదువు పూర్తి చేసి ఇంట్లోనే ఉంటున్నా. గృహాలకు సమీపంలోనే ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయడం బాగుంది. ముఖ్యంగా గృహిణులకు, యువతులకు ఇవి ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. నేను రోజూ సాయంత్రం ఓపెన్ జిమ్‌కి వచ్చి వ్యాయామం చేస్తున్నా. ఇక్కడ నెలకొన్న ఆహ్లాదకర వాతావరణం ఎంతగానో ఆకట్టుకుంటోంది.

– నీలిమ, వేపగుంట

మాలాంటి వారికి వరం



నేను బీటెక్ పూర్తిచేశా. కొన్ని రోజుల నుంచి ఓపెన్ జిమ్‌కి రెగ్యులర్‌గా సాయంత్రం వేళల్లో వచ్చి ఇక్కడున్న పరికరాల సాయంతో వ్యాయామం చేస్తున్నా. లేజీనెస్ పోగొట్టుకోవడానికి నాకు ఓపెన్ జిమ్ ఎంతగానో ఉపయోగపడుతోంది. రూ.వేలు ఇచ్చి ప్రైవేట్ జిమ్‌లకు వెళ్లలేని వారికి ఈ ఓపెన్ జిమ్‌ల ఏర్పాటు ఒక వరంగా భావించాలి.

– సౌమ్య, వేపగుంట

సొంత ఖర్చులతో రిపేర్లు



ఓపెన్ జిమ్‌లో వ్యాయామ పరికరాలు రిపేర్లకు గురైతే సొంత ఖర్చులతో రిపేర్లు చేయించుకుంటున్నాం. ఎలాంటి మెయింటెనెన్స్ చార్జీలు రావట్లేదు. మొక్కలకు వాటర్ సదుపాయం లేకపోవడంతో పక్కనున్న బోర్లను వినియోగిస్తున్నాం. లైటింగ్ సమస్య పరిష్కరిస్తే మరింతగా ఓపెన్ జిమ్ ఉపయోగపడుతుంది.

– ఎస్.రామచంద్రరావు, కార్యదర్శి, వేపగుంట ఓపెన్ జిమ్ వాకర్స్ అసోసియేషన్

'బహు వార్షిక పశుగ్రాస పథకాన్ని వినియోగించుకోండి'



భర్నికంలో పశువులకు వైద్య సేవలందిస్తున్న పశువైద్య అధికారి అశ్విని ప్రఫుల్లా



మొగలిపురంలో పశువులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సంధ్య తదితరులు

పరవాడ: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న బహు వార్షిక పశుగ్రాస పథకాన్ని పాడిరైతులు వినియోగించుకోవాలని పరవాడ పశుసంవర్ధక శాఖ ఏడీ రామకృష్ణకీర్తి పిలుపునిచ్చారు. భర్నికం, నాయుడుపాలెం గ్రామాల్లో సోమవారం నిర్వహించిన పశు ఆరోగ్య శిబిరాలను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ బహు వార్షిక పశు గ్రాస పథకాన్ని ఏర్పాటు చేసుకునేందుకు ముందుకు వచ్చిన రైతులకు ప్రభుత్వం రూ.32 వేలు ఆర్థిక సాయం అందిస్తుందన్నారు. ఈ పథకాన్ని 5 సెంట్ల భూమిలో నిర్వహించుకోవచ్చన్నారు. శిబిరాల్లో 427 పశువులు, గొర్రెలు, మేకలకు వైద్య సేవలందించారు. లింగ నిర్ధారణ వీర్య నాళికలు ద్వారా ఆడ పెయ్యలను అభివృద్ధి చేసుకునేందుకు ముందుకు వచ్చిన రైతులకు ప్రభుత్వం రూ.850కే అందిస్తుందన్నారు. కార్యక్రమంలో వాడచీపురుపల్లి, లంకెలపాలెం పశువైద్యులు సురేష్ కుమార్, అశ్విని ప్రఫుల్లా, భర్నికం, నాయుడుపాలెం సర్పంచ్‌లు పెదిశెట్టి పూజా శేఖర్, కూండ్రపు వరలక్ష్మి సీతారామయ్య, భర్నికం మాజీ సర్పంచ్ బొండా తాతారావు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గుల్లేపల్లిలో పశువైద్య శిబిరం

సబ్బవరం: పాడి రైతులు పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని గుల్లేపల్లి పశు వైద్యురాలు డాక్టర్ బి.సంధ్య సూచించారు. మండలంలోని మొగలిపురంలో నిర్వహించిన పశు వైద్య శిబిరాన్ని సర్పంచ్ గండి అరుణ సోమవారం ప్రారంభించారు. ఈ శిబిరంలో అనారోగ్యంతో బాధపడుతున్న 22 పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 40 పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స అందించారు. 18 చూడి ఆవులను తనిఖీ చేశారు. 62 లేగ దూడలకు, గ్రామంలోని గొర్రెలకు నట్టల నివారణ మందులు వేశారు. వైద్య శిబిరంలో గ్రామ పెద్దలు తమరాణ బంగారినాయుడు, డాక్టర్ ఎస్.స్వర్ణలత, పశు సంవర్ధకశాఖ సహాయకులు ఎ.రమేష్, డి.రమేష్, గోపాల మిత్ర దేముడు బాబు, ల్యాబ్ టెక్నీషియన్ మళ్ల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణలను సహించబోం

- ఆర్డీవో శ్రీలేఖ హెచ్చరిక



వినతులు పరిశీలిస్తున్న ఆర్డీవో శ్రీలేఖ

పెందుర్తి: ప్రభుత్వ భూముల ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్డీవో పి.శ్రీలేఖ హెచ్చరించారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ భూ ఆక్రమణలపై వస్తున్న ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఒకే ఫిర్యాదు మళ్లీ మళ్లీ వస్తే సహించేది లేదని అధికారులను హెచ్చరించారు. పలు సమస్యలపై 4 ఫిర్యాదులు వచ్చాయి. తహసీల్దార్ ఆనంద్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వానికి వ్యతిరేకంగా వీవోఏల దీక్షలు



జీవీఎంసీ పార్కులో రిలే దీక్ష చేస్తున్న ఏపీ వెలుగు వీవోఏ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు

సీతమ్మధార : కూటమి అధికారంలోకి వచ్చాక వీవోఏల సమస్యలు పరిష్కరించడంలో తీవ్ర అలసత్వం వహిస్తోందని ఏపీ వెలుగు వీవోఏ (యానిమేటర్స్)ల సంఘం, సీఐటీయూ రాష్ట్ర కమిటీ నేతలు పేర్కొన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మూడు రోజులు రిలే దీక్షల్లో భాగంగా తొలిరోజు సోమవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిర్వహించిన దీక్షలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు నెలలుగా జీతాలు ఇవ్వకపోతే వీవోఏలు ఎలా బతుకుతారని ప్రశ్నించారు. అక్రమంగా తొలగించిన వీవోఏలను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయకపోవడం కోర్టు ధిక్కారమేనని పేర్కొన్నారు. ప్రతి మండలం నుంచి ఐదుగురు ముఖ్యమైన నాయకులు దీక్షలో కూర్చున్నారు. యూనియన్ గౌరవాధ్యక్షురాలు పి.మణి, అధ్యక్ష కార్యదర్శులు అపర్ణ, కుంచమ్మ, కోశాధికారి శ్రీలక్ష్మి, ముఖ్య నాయకులు వెంకటలక్ష్మి, పార్వతి, శారద దీక్షలకు నాయకత్వం వహించారు.

తాగునీరు, రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యం



మంచినీటి పదకానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే పంచకర్ల, సింహాద్రి జీజీఎం సమీర్‌శర్మ

పరవాడ: ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. ముత్యాలమ్మపాలెంలో రూ.38.60 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించడంతో పాటు ఎన్టీపీసీ ఆర్థిక సాయంతో రూ.15 లక్షలతో నిర్మించనున్న రక్షిత మంచినీటి పథకం, రూ.15.55 లక్షలతో సీసీ కాలువల నిర్మాణాలకు సోమవారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు అవసరమైన తాగునీరు, రహదారులు వంటి వాటికి అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. మత్స్యకారుల సంక్షేమం కోసం తన వంతు కృషి చేస్తానన్నారు. ఫార్మాసిటీ కాలుష్యం వలన ఉపాధి కోల్పోయిన మత్స్యకారులకు ఏడాదిలోపు పరిశ్రమల్లో ఉపాధి కల్పించడంతో పాటు ముత్యాలమ్మపాలెం తీరంలో మినీ జెట్టీ ఏర్పాటు, సమ్మెంగపాలెంలో కల్యాణ మండపం నిర్మాణాలకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజల దాహార్తిని తీర్చడంతో పాటు సీసీ కాలువల నిర్మాణాలకు అవసరమైన చర్యలు తీసుకుంటున్న సింహాద్రి ఎన్టీపీసీ యాజమాన్యాన్ని అభినందించారు. కార్యక్రమంలో ఎన్టీపీసీ సింహాద్రి జీజీఎం సమీర్‌శర్మ, తహసీల్దార్ ఎస్వీ అంబేడ్కర్, మాజీ జెడ్పీటీసీ పైల జగన్నాథరావు, మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు, ముత్యాలమ్మపాలెం సర్పంచ్ సీహెచ్ సుజాత ముత్యాలు, రావాడ, ఈ బోనంగి సర్పంచ్‌లు మోటూరు సన్యాసినాయుడు, బొద్దపు శ్రీనివాసరావు, కూటమి నాయకులు బుగిడి రామగోవిందరావు, కూండ్రపు శ్రీరామ్మూర్తి, కన్నూరు వెంకటరమణ, ముత్యాలమ్మపాలెం ఎంపీటీసీ అరిజిల్లి దేవి రవి, సూరాడ ముత్యాలరావు, అమ్మోరు, పెంటయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ షణ్ముఖ, పంచాయతీ రాజ్ ఏఈ స్వాతి, ఎన్టీపీసీ సీఎస్సార్ అధికారులు పాల్గొన్నారు.

నేడు డీజీపీ రాక

- పరవాడ జేఎన్ ఫార్మా కోస్టల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ వద్ద గంజాయి ధ్వంసం

పరవాడ: రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావు మంగళవారం పరవాడ జేఎన్ ఫార్మాకు రానున్నారు. అనకాపల్లి జిల్లాలో అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో పట్టుబడిన గంజాయిని ఆయన ఆధ్వర్యంలో ధ్వంసం చేయనున్నారు. పరవాడ జేఎన్ ఫార్మాలోని రాంకీ కోస్టల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ పరిశ్రమ వద్ద డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో 35 వేల కిలోల గంజాయిని ధ్వంసం చేయనున్నారు.

జిల్లా పరిషత్ ఆస్తుల సంరక్షణకు చర్యలు



పురుషోత్తపురంలోని జెడ్పీ స్థలాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, సీఈవో నారాయణమూర్తి

పెందుర్తి: జిల్లా పరిషత్‌కు చెందిన స్థలాలు, ఇతర ఆస్తులను అక్రమార్కుల చెర నుంచి కాపాడేందుకు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధికారులను సూచించారు. జీవీఎంసీ 95వ వార్డు పరిధి పురుషోత్తపురంలోని జిల్లా పరిషత్‌కు చెందిన స్థలాన్ని జెడ్పీ సీఈవో నారాయణమూర్తి, ఇతర అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సుభద్ర మాట్లాడుతూ ఎక్కడైనా జెడ్పీ ఆస్తులు ఆక్రమణకు గురైనట్లు ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సీఈవో నారాయణమూర్తి మాట్లాడుతూ జెడ్పీ, మండల పరిషత్ స్థలాల రక్షణ బాధ్యత స్థానిక అధికారులు తీసుకోవాలని సూచించారు. ఎంపీడీవో కొల్లి వెంకట్రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జనసంద్రమైన తాజుద్దీన్‌బాబా ఆశ్రమం



చందల్‌కు ఎదురెళ్లి స్వాగతం పలుకుతున్న ఆశ్రమ వ్యవస్థాపకుడు తాజి రెడ్డిబాబా

తగరపువలస: భగవాన్ తాజుద్దీన్‌బాబా 164వ జయంతిలో భాగంగా సోమవారం భీమిలి మండలం దాకమర్రి పంచాయతీ నీలయమ్మసత్రం కూడలిలోని బాబా ఆశ్రమ కూడలి భక్తులతో జనసంద్రంగా మారింది. వేలాది మంది భక్తులకు ఆశ్రమ నిర్వాహకులు ఆదివారం నుంచి మూడు రోజుల పాటు అన్నప్రసాదాలు పంపిణీ చేస్తున్నారు. ఈ సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాలు, ఉత్తరాదిలోని నాగ్‌పూర్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, జార్ఖండ్, ఒడిశాకు చెందిన వేలాది మంది భక్తులు కులమతాలకు అతీతంగా బాబాకు మేళతాళాలు, బాణసంచా, నేలవేషాలు, కోలాటం, పులివేషాలు, తీన్‌మార్‌తో చందల్, చాదర్, గులాబీలు, అత్తరు తీసుకువచ్చి దర్బారులో దువా అర్పించారు. బాబా చిత్రపటాన్ని ప్రత్యేక రథంపై ఊరేగింపుగా తీసుకు వెళ్లారు. ప్రధానంగా విజయనగరానికి చెందిన రొబ్బి హేమకుమార్, నాగ్‌పూర్‌కు చెందిన మహమ్మద్ షార్ఫుద్దీన్ తాజి, ఛత్తీస్‌గఢ్ డోంగర్‌గడ్‌కు చెందిన ఖాదర్‌వలీబాబా ఆశ్రమ నిర్వాహకులు సమర్పించిన చాదర్‌లు ఘనంగా నిలిచాయి. వీటికి ఆశ్రమ వ్యవస్థాపకుడు తాజి రెడ్డిబాబా ఎదురుగా వెళ్లి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా పలువురు ఆయన నుంచి ఆశీర్వచనాలు తీసుకున్నారు. ఆశ్రమం ఆవరణలో ఖవ్వాలీ ప్రదర్శించారు. జయంతి వేడుకలకు వచ్చిన భక్తులు దర్బారుతో పాటు బాబా ధ్వజానికి పూజలు చేసి దునిలో సుగంధ ద్రవ్యాలు సమర్పించారు. కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఆశ్రమం నుంచి జాతీయరహదారి వరకు మార్గాలలో తీర్థం నిర్వహించారు. వివిధ వస్తువులు రూ.5 నుంచే లభించడంతో పాటు విలువైన వస్త్రాలు, అత్తరు లభించాయి. పలువురు భక్తులకు బాబా క్యాలెండర్లు పంపిణీ చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా భీమిలి లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆశ్రమ ట్రస్టీలు డి.రాజు కుమందన్, మహమ్మద్ అస్లాం, మహమ్మద్ సాహెబ్, వి.త్రిమూర్తి భక్తులకు భోజన, వసతి సదుపాయాలు సమకూర్చారు.

మంచుదుప్పటి



నగర పరిసర ప్రాంతాలను సోమవారం పొగమంచు కప్పేసింది. సింహాచలం బీఆర్టీఎస్ రోడ్డులో ఉదయం 8 గంటల వరకూ మంచు కురిసింది. రోడ్లపైకి వచ్చినవారు ఇబ్బందిపడ్డారు. వాహన చోదకులు పగటిపూట కూడా లైట్లు వేసుకుని మరీ నడపాల్సి వచ్చింది. – ఫొటోలు, సాక్షి, ఫొటోగ్రాఫర్